# ఇది సమ్మెల కాలమనీ....




"మన కోర్కెలు చాలా న్యాయమైనవి! కాదని ఎవ్వరూ అనలేరు. అలాంటప్పుడు ఈ కోర్కెలు ఎందుకు తీర్చరు? మనలో అవినీతి పరులుండవచ్చు. జీతంతో అవసరం లేనంత పై సంపాదన గాళ్ళుండవచ్చు. కాని అలాంటివాళ్ళు అన్నిచోట్లా వుంటారు. రాజకీయాల్లో మరీ ఎక్కువ. ఆ మాటకొస్తే అవినీతి అనేది ప్రపంచమంతటా తెగ ఉ ందనీ కనుక మనం దాన్ని గురించి ఏ మాత్రం పట్టించుకోకూడదనీ మన ప్రధానమంత్రి గారే స్వయంగా శెలవిచ్చారు. కనుక సోదరులారా! మన న్యాయమయిన కోర్కెలు సాధించుకోవాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మె ఒక్కటే మార్గమని నేను మనవి చేస్తున్నాను. ఈ క్షణం నుంచే మన సమ్మె ప్రారంభమవుతోంది- సమ్మె చేస్తే ప్రజలకు ఇబ్బంది- అంటూ ప్రభుత్వం చెప్పే మాటలు నమ్మకండి! మనమూ ప్రజల్లో భాగమే!"

అంతా కోలాహలం, తప్పట్లు, నినాదాలు మార్మోగిపోయినయ్. గోపాత్రావ్ స్టేజి దిగిరాగానే శాయిరాం కలుసుకున్నాడు.

"అమ్మయ్య! బ్రతికాం! ప్రభుత్వంతో చర్చలు ఫలప్రదమయి సమ్మె జరగదేమోనని తెగ భయపడ్డాను" అన్నాడు శాయిరామ్.

గోపాల్రావ్ ఆశ్చర్యపోయాడు.

"జరగకపోతే భయమెందుకు?"

"బోలెడు ఇంటి వ్యవహారాలు చూచుకోవాల్సి ఉంది! నెలరోజులు శెలవు ఏకబిగిన కావాలంటే దొరకదు కదా! అందుకని ప్రతి సంవత్సరం ఇంటి వ్యవహారాలన్నీ సమ్మెటైమ్‌లోనే పూర్తి చేసుకుంటాను" అన్నాడతను.

"అసలు నన్నడిగితే, ప్రతివాడికీ 'సమ్మె శెలవు' అని నెలరోజులు ప్రత్యేకంగా ఉండాలంటాను. ఎవడికి వాడు సమ్మె చేసుకుని ఆ లీవ్ వాడుకొనే వీలుండాలి" అన్నాడు రంగారెడ్డి.

మా కాలనీ వాళ్ళంతా ఒకే డిపార్టుమెంటులో పని చేస్తుండడం వల్ల అందరం గుమికూడాము.

అందరూ రంగారెడ్డి అభిప్రాయం పరిశీలించదగ్గదే అని బలపర్చారు.

మైక్ దగ్గరకు మాజీ కేంద్ర మంత్రివర్యులు వచ్చి ఉపన్యాసం ప్రారంభించారు.

"ఇగో- మీరడిగే కోర్కెలు ఏమైతే ఉన్నవో- అవి పూరా ఇన్సాఫ్‌తోటున్నయ్. మరి గీ రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను ఖతం జేయనికి జరంతగూడ కోషిష్ జేస్తలేదు. నేనేగిట్ట గిప్పుడు స్టేట్లో మినిష్టరున్నట్లయితే మీ డిమాండ్లన్ని శాంక్షన్ జేస్తుండె!"

జనంలో నుంచి ఎవరో గట్టిగా అరిచారు.

"అరే బాడుకవ్! మా రైల్వేవోళ్ళం స్ట్రైక్ జేస్తున్నప్పుడు వాళ్ళ ఇండ్లలోకి పోలీసుల్ని పంపి భార్యలను అవమానించి, పిల్లలను పరిషాన్ జేసి, చాలామందిని కొలువుల్లోకెళ్ళి చుట్టీ ఇచ్చినావ్ గుర్తులేదురా! నీ యవ్వా- ఇప్పుడీ స్టేట్ గవర్నమెంటోళ్ళను జూస్తే ఇంత దుఃఖమవుతున్నాది? లే- సాలె! స్టేజి దిగు."

మరి కొంతమంది కూడా ఇంచుమించుగా అలాంటి అర్ధం వచ్చే భాషే వాడడంతో మాజీ కేంద్ర మంత్రిగారు స్టేజీ దిగిపోయారు.

మీటింగ్ ముగిసింది.

"ఇప్పుడేం చేద్దాం?" అడిగాడు శాయిరామ్.

"ఏదయినా సినిమాకి పోదాం పదండి!" అన్నాడు గోపాల్రావ్.

అందరం సైకిళ్ళెక్కి మార్నింగ్‌షోకి బయల్దేరాం.

సినిమా మొదలయిన పావుగంటకే కరెంట్ పోయింది. అరగంటయినా కరెంట్ రాలేదు. చివరకు హాల్ గేట్ కీపర్ స్టేజీ మీద కొచ్చాడు.

"దేఖోభాయ్! ఎలక్ట్రిసిటి డిపార్టుమెంటోళ్ళు స్ట్రయిక్ జేస్తున్రని ఫోన్లో జెప్పిన్రు! ఇంక మీరిండ్లకు పోండ్రి" అన్నాడు వినయంగా.

జనంలో నుంచి కలకలం- కేకలు మొదలయ్యాయి.

"కరెంట్ పోతే ఏమాయె జనరేటర్ స్టార్ట్ జెయ్యాలె!" అంటూ ఎవరో అరిచారు.

"జనరేటర్ ఖరాబున్నది."

"ఖరాబుంటే ముంగటే రిపేర్ జేయించాల్రా బాడుకవ్" ఎవరో అరచారు.

"సాలె ఎవళ్ళు జెపున్నార్రా ఆ మాట?"

"నేను జెప్తున్నా బే!"

"నువ్వెవడివిరా చెప్పనికి సాలె?"

"నీ మొగుడ్నిరా బాడుకవ్!"

ఇద్దరూ ముందుకి దూకి చొక్కాలు పట్టుకోయేంతలో మేనేజర్ వచ్చి విడిపించాడు.

"ఇగో– అర్ధగంటలో జనరేటర్ రిపేర్ గిట్ట జేయించి సినిమా షురూ చేయకబోతివా– ఫర్నిచరంతా జలాయిస్తాం" అన్నాడు ఇంకొకడు.

"ఎలక్ట్రిసిటీ వాళ్ళకి మరీ అలుసెక్కువయిపోయింది. 'ఆ' అంటే స్ట్రయిక్'ఊ' అంటే స్ట్రయిక్" అన్నాడు గోపాల్రావ్ చిరాకుగా.

స్ట్రైక్ మూలాన– పదిహేనురోజులు కరెంట్ లేకపోవడం వల్ల మా పిల్లలిద్దరూ పరీక్ష తప్పారు" అన్నాడు రంగారావ్.

"నన్నడిగితే మిలటరీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీర్స్‌ని తీసుకొచ్చి వీళ్ళసమ్మె విరగ్గొట్టాలి" అన్నాడు శాయిరామ్.

మెకానిక్ అర్జంటుగా వచ్చి జనరేటర్ స్టార్ట్ చేశాడు.

సినిమా మళ్ళీ ప్రారంభమయింది. ఈసారి మళ్ళీ పదినిముషాలకే ఆగిపోయింది.

"మళ్ళీ ఏం రోగమొచ్చింది?" ఎవరో అరిచారు.

"గిప్పుడే ఫోన్లో ఇన్‌ఫర్‌మేషనొచ్చినాది! మన ఆంధ్రప్రదేశ్ సినిమా హాల్స్ అసోసియేషన్ వాళ్ళు సడెన్‌గా సమ్మె షురూజేసిన్రు. కనుక సమ్మె ఖతమయేవరకూ సినిమాలు నడవయ్. మీరు గూడా సమ్మెజేసేటోళ్ళే. మా కష్టాలు మాకున్నయి. జరంత సమజ్ చేసుకోండి. జరంత మీరు బయటకు పోతే థియేటర్ మూసి సమ్మె చేసుకుంటం."

అందరూ కోపంగా అరుపులూ, కేకలూ, తిట్లూ మొదలెట్టి చేసేది లేక బయటకు నడిచారు.

"ఆట మధ్యలో సమ్మె ఏమిటి? వీళ్ళకేయినా బుద్ధుందా?" కోపంగా అన్నాడు గోపాల్రావ్.

"అబ్బే, దేశంలో డిసిప్లిన్ అనేది లేకుండా పోతోంది" అన్నాడు రాందాస్.

అందరం మళ్ళీ సైకిళ్ళు తీసుకుని రోడ్డుమీద కొచ్చాం!

"ఇప్పుడెక్కడికి పోదాం!" అడిగాడు శాయిరామ్.

"ఏదయినా హొటల్‌కిపోయి కాసేపు బాతాఖానీ వేద్దాం!" సలహా ఇచ్చాడు

రంగారెడ్డి. సైకిళ్ళు బయలుదేరాయి.

పాతిగ్గజాలయినా వెళ్ళకముందే హఠాత్తుగా మలుపు తిరిగిన రోడ్డుకి అడ్డంగా నిలువెత్తుగొయ్యి కిపించింది. అందరూ సడన్ బ్రేకు వేసుకుని ఆగిపోయారు గానీ– గోపాల్రావ్ సైకిల్‌కి బ్రేకులు లేకపోవడంతో సైకిల్‌మీద కూర్చున్న యాదగిరితో సహా గోతిలో పడిపోయారు. సైకిల్ వాళ్ళిద్దరిమీదా ఉంది.

అందరం కలిసి వాళ్ళను బయటకులాగాము అతికష్టం మీద.

ఆ గొయ్యి తవ్విన వాటర్‌వర్క్స్ డిపార్టుమెంట్ వాళ్ళు ఆ పక్కనే నిలబడి సిగరెట్టు తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఏయ్! గొయ్యి తవ్వినవాళ్ళకి పూడ్చడం తెలీదూ?" కోపంగా అదిచాడు రంగారెడ్డి చొక్కా చేతులు మడుస్తూ.

"ఎందుకు తెలీదు? తెలీదని ఎవరన్నారసలు?" ఆశ్చర్యంగా అడిగాడు ఆ గ్రూప్‌లో ఒకడు.

"తెలుస్తే నడిరోడ్డు మీద ఇంత పెద్ద గొయ్యి తవ్వి ఎందుకు వదిలేసినట్లు?"

"ఎందుకేమిటి సార్? లైట్నింగ్ స్ట్రయిక్ చేస్తున్నాం. రోడ్లన్నీ గోతులు తవ్వాక హఠాత్తుగా సమ్మె చేయాలని మా యూనియన్ ఆదేశాలిచ్చింది. మొత్తం సిటీలో ట్రాఫిక్కంతా ఈ గోతుల దగ్గర స్తంభించి పోతుంది కదా! దాంతో మా వర్కర్స్ కోర్కెలు అప్పటికప్పుడు తీర్చడానికి ప్రభుత్వం ఒప్పుకోకేం జేస్తుంది?"

"మీకేమయినా బుద్ధుందా? ఇలా ప్రమాదకరమైన పరిస్థితుల్లో ప్రజలను ఇరికించి సమ్మె జేస్తారా?" బాధతో మూలుగుతూనే అరిచాడు గోపాల్రావ్.

"ఇదిగో– ప్రజల మీద పెద్ద ప్రేమున్నట్లు బోడి ఫోజివ్వకు. వాళ్ళమీద అంత ప్రేముంటే మీరెందుకు సమ్మె జేస్తున్నట్లు?" అడిగాడతను నింపాదిగా.

గోపాల్రావ్ ఉలిక్కిపడ్డాడు.

"మేమా? మేము సమ్మెజేస్తున్నామని ఎవరు చెప్పారు నీకు?"

అతను విరగబడి నవ్వాడు.

"భలేవాడివి దొరికావులే. చొక్కాకున్న బాడ్జి చూస్తే తెలీటం లేదూ?"

అందరం దెబ్బతిన్నట్లు ఒకరి మొఖాలొకరు చూసుకున్నాం. సైలెంట్‌గా అక్కడినుంచి మూవ్ అయిపోయాం.

గోపాల్రావ్ కాలికి ఫ్రాక్చరయినట్లు అందరకీ అనుమానం కలిగింది. కాలు కింద పెట్టలేకపోతున్నాడతను.

"ఆటోలో హాస్పిటల్‌కి తీసుకెళ్దాం" అన్నాడు శాయిరామ్.

ఆ పక్కనే వున్న ఆటోరిక్షా దగ్గరకు పరుగెత్తాం నేనూ. శాయిరామ్ ఆటో రిక్షా అతను సీరియస్‌గా వెనుక సీట్లో పడుకుని సిగరెట్ తాగుతున్నాడు.

"ఆటో- త్వరగా హాస్పిటల్ కెళ్ళాలి పద" అన్నాను ఆత్రుతగా. వాడు మావంక 'ఉ సుళ్ళు' అనే పురుగుల్ని చూసినట్లు చూశాడు. చూడ్డమే కాకుండా 'ఉఫ్' అని ఊదాడు.

నేనూ- శాయిరామ్ మొఖాలు చూచుకున్నాం.

"ఏయ్ మిస్టర్- నీకే చెప్పేది- త్వరగా హాస్పిటల్‌కి వెళ్ళాలి."

"గో- టు - హెల్-" అన్నాడు ఆటోవాడు మరో దమ్ము పీల్చి.

"ఏమిటి?"

"గో- టు- హెల్-"

"ఏమిటి గో-టు- హెల్" కోపంగా అడిగాడు శాయిరామ్

"ఇంగ్లీషు తెలీదా?"

"తెలుసు."

"తెలుస్తే ఏ బి సి డిలు చివరివరకూ చెప్పు."

"ఇప్పుడిదంతా ఎందుకు? అర్జంటుగా హాస్పిటల్‌కి వెళ్ళాలంటేనూ?" భయంగా అన్నాడు శాయిరామ్- ఒకవేళ వాడికేమైనా మెంటలేమోనని.

నాకు శాయిరామ్ వీక్‌నెస్ తెలుసు!

"యు.వి.అన్న అక్షరాల్లో ఏది ముందో ఏది వెనకో శాయిరామ్‌కి ఇప్పటికి కంప్యూజనే!

"అయితే నీకు ఇంగ్లీష్ రాదు" వికటాట్టహాసం చేశాడు ఆటోవాడు.

"వచ్చు" అన్నాడు శాయిరామ్.

"నీకు ఏ బి సి డీలు తెలుస్తే హాస్పిటల్‌కి రమ్మని పిలువవు"

"ఎందుకు పిలవను.'

"ఎందుకంటే ఇవాల్టి ఇంగ్లీష్ పేపర్లో మా ఆటో అసోసియేషన్ వాళ్ళు స్ట్రైక్ చేస్తున్నట్లు రాసినా నీకా విషయం తెలీలేదు కాబట్టి."

"మీరెందుకు సమ్మె జేస్తున్నారు?" అనడిగాను అతనిని.

"సవాలక్ష కారణాలుంటాయ్- మీకెందుకు- ఆర్చేవారా తీర్చేవారా" అంటూ మరో సిగరెట్ వెలిగించుకుని మా వంక మళ్ళీ 'ఉసుళ్ళు'ను చూసినట్లు చూసి 'ఉఫ్' అని ఊదాడు.

ఇక లాభం లేదని మేం వెనక్కు వచ్చేశాము.

అందరం కలసి గోపాల్రావ్‌కి సహాయం చేస్తూ బస్‌స్టాండ్ దగ్గరకు తీసుకెళ్ళాము. అరగంట నుంచున్నా బస్ రాకపోయేసరికి అనుమానం వచ్చింది.

"కొంపదీసి వీళ్ళూ స్ట్రైక్ చేయటం లేదు కదా" అన్నాడు రాందాస్ అనుమానంగా. ఈలోగా ఎదురుగ్గా కేకలు- అరుపులు వినిపించాయ్.

విద్యార్థులు చాలామంది పుస్తకాలు చేత్తోపట్టుకుని నినాదాలు చేస్తున్నారు.

"కాపీలు పట్టుకోవడం నశించాలి.

పరీక్షా విధానం మారాలి.

గ్రేస్ మార్కులు- కావాలి-

"మినిమమ్ పాస్ మార్కులు- ఇంకా సగానికి తగ్గాలి."

ఆ నినాదాలు యిస్తోంది మరెవరో కాదు. మా రాందాస్ కొడుకే! వాడు ఎనిమిదో క్లాస్ చదువుతున్నాడు. వాడితోపాటు కాలనీ కుర్రాళ్ళు చాలామంది ఉన్నారు.

"ఒరేయ్. ఇలారా" పిలిచాడు రాందాస్.

"వాట్ డాడీ?"

"స్కూలు కెళ్ళరా అంటే ఇక్కడ తిరుగుతున్నావా?"

"మేం సమ్మె చేస్తున్నాం డాడీ! తిరగటం లేదు. పొద్దున్నుంచీ ఇప్పటివరకూ ఆరు బస్సులు తగలబెట్టాం- ఎనిమిది బస్సుల మీద రాళ్ళు కొట్టాం- పధ్నాలుగు జతల టైర్లు కోసేశాం" గర్వంగా చెప్పాడు వాడు.

"అయితే బస్సులు తిరక్కపోవడం మీ ప్రభావమే అన్నమాట. పద ఇంటికి"

"సారీ డాడీ! మీరూ సమ్మె జేస్తున్నారు కదా. నేను అడ్డు తగిలానా? ఎవరి సమ్మె వారిది- ఇలా జోక్యం కలిగించుకోవడం, ఆలిండియా స్ట్రయికర్స్ అసోసియేషన్ నిబంధనలకు వ్యతిరేకం" అనేసి మళ్ళీనినాదాలు చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

చేసేదిలేక ఓ రిక్షా పాతిక రూపాయలకు మాట్లాడి గోపాల్రావ్‌ని హాస్పిటల్‌కు తీసుకెళ్ళాం. వెంటనే టెస్ట్ చేసేసి ఆపరేషన్ అవసరం అన్నారు.

అప్పటికప్పుడే ఆపరేషన్ ఏర్పాట్లు పూర్తి చేసారు సిబ్బంది.

తీరా ఆపరేషన్ మొదలుపెట్టే ముందు హాస్పిటలంతా పెద్ద కేకలు వినిపించినయ్. నర్సులంతా బయటకు పరుగెత్తి హాస్పిటల్ ముందు నిలబడి నినాదాలు చేయసాగారు.

విషయం ఏమిటని ఓ డాక్టర్ నడిగాము.

"మరేం లేదు, నర్స్‌లంతా రెండుగంటల పాటు టోకెన్ స్ట్రైక్ చేస్తునారు. వాళ్ళు మళ్ళీ డ్యూటీలో కొచ్చాక ఆపరేషన్ చేస్తాము" అనేసి గోపాల్రావ్‌ని ఆపరేషన్ టేబుల్ మీద వదిలేసి ఎవర్దారిన వాళ్ళు వెళ్ళిపోయురు. రెండు గంటయ్యాక నర్సులంతా మళ్ళీ డ్యూటీలోకొచ్చారు.

ఆపరేషన్ ప్రారంభమవబోతూండగా మళ్ళీ కేకలు వినిపించాయి.

"మళ్ళీ ఏమిటి?" భయంగా అక్కడున్న నర్సు నడిగాడు శాయిరామ్.

"డాక్టర్స్ లైటినింగ్ స్ట్రయిక్ చేస్తున్నారు."

"ఎందుకు?"

"అదింకా ఎవ్వరికీ తెలీదు. సమ్మె హఠాత్తుగా ప్రారంభించాలని పైన్నుంచి డాక్టర్స్ అసోసియేషన్ వాళ్ళుఫోన్ జేశారట."

ఆమె చెప్తుండగానే డాక్టర్లందరూ చేతులు తుడుచుకుంటూ బయటికెళ్ళిపాయారు.

"డాక్టరు గారూ- ఆపరేషన్ పూర్తి చేశాక స్ట్రైక్ చేయవచ్చుగదా్సర్" ఆందోళనగా వెంట పరిగెడుతూ అడిగాడు రెడ్డి.

"ఏడ్చినట్లుంది. లైటెనింగ్ స్ట్రయిక్ అంటే ఎక్కడివక్కడే వదిలేయాలి."

"మరి ఇప్పుడు ఆపరేషన్ టేబుల్ మీదున్న పేషెంట్ గతేమిటి?"

"మేం సమ్మె విరమించేవరకూ అలాగే వుండాలి."

"ఒకవేళ మధ్యలో చచ్చిపోతే?"

"అలా పేషెంట్లు చచ్చిపోవడం- మా సమ్మెకెంతో మంచిది. ఎంత ఎక్కువమంది టపా కడుతుంటే ప్రభుత్వం అంత భయపడి మా డిమాండ్స్ అంగీకరిస్తుందన్నమాట- జిందాబాద్ జిందాబాద్- డాక్టర్స్ యూనిటీ జిందాబాద్" అని అరుస్తూ వెళ్ళిపోయాడు.

మేమేం చేసేదిలేక గోపాల్రావ్‌నీ- సగం ఆపరేషన్ అయిన అతని కాలినీ జాగ్రత్తగా ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తీసుకుపోబోతుంటే ఓ వ్యక్తి మా దగ్గరకొచ్చాడు.

"సార్! ఆపరేషన్ పూర్తిచేస్తాను. రెండు వందలు కాష్ ఇవ్వండి చాలు."

"అదేమిటి? మీరు స్ట్రైక్ చేయటంలేదా?" అడిగాడు గోపాల్రావ్.

"మా వార్డ్ బాయిస్‌కి సమ్మె ఏమీలేదుకదండి!"

అందరం అదిరిపడ్డాం.

"నువ్వు వార్డ్ బాయ్‌వా?"

"అవునండీ."

"మరి ఆపరేషన్ చేస్తానంటావేమిటి?"

"పధ్నాలుగేళ్ళ నుంచీ ఈ ఆపరేషన్ థియేటర్‌లోనే వార్డ్ బాయ్‌గా ఉన్నా సార్! ఆ మాత్రం తెలీదేంటి? మా ఇంటి దగ్గర నాకు ఆపరేషన్ థియేటర్ వుంది సార్! పేషెంట్లు ఎక్కువ దొరకడం లేదు గానీ లేకపోతే ఈ వెధవ ఉద్యోగం ఎందుకు చేస్తాను. బాబ్బాబు- పోనీ వందివ్వండి చాలు- ఫస్ట్‌క్లాస్ ఆపరేషన్ చేస్తాను. ఇంతవరకూ ఆరొందలు ఆపరేషన్లు చేశాన్సార్"

అతికష్టం మీద వాడిని వదిలించుకుని గోపాల్రావ్‌ని ప్రైవేట్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళి ఎడ్మిట్ చేశాం.

మిగిలిన వాళ్ళందరం ఆకలితో మలమలలాడుతూ మా కాలనీకి నడుచుకుంటూ చేరుకునేసరికి– కాలనీలో పెద్ద మీటింగ్ జరుగుతోంది. కాలనీ ఆడాళ్ళందరూ కూర్చుని ఉన్నారక్కడ.

కనుక సోదరీమణులారా– ప్రతిరోజూ మనకో గండంగా తయుచేస్తున్నారీ మగాళు ్ళ. మిల్క్‌వాన్ ఆలస్యమయి కాఫీ ఆలస్యమయితే భార్యల్ని తిడతారు. కూరగాయలు దొరక్కపోతే మనదే బాధ్యత. వంట కుదరకపోతే మనదేతప్పు. చాకలి రాకపోయినా మనమే రెస్పాన్సిబుల్..."

"షేమ్ షేమ్" అని అరిచారు చాలామంది–

"కనుక మనం నిన్న తీసుకున్న రహస్య నిర్ణయం ప్రకారం ఈ రోజు నుంచీ సమ్మె చేస్తున్నాం. అంటే అసలు వంట చేయమని కాదు. కేవలం మనకీ పిల్లలకూ మాత్రమే వండుకుంటామన్నమాట. మనమీద ఈ మగవాళ్ళ గుండాయిజం తగ్గేవరకూ మనం ఈ పద్ధతి అనుసరించక లప్పదు. సమ్మె ఈ రోజునుంచే ఎందుకను కున్నామంటే– ఇవ్వాల్టి నుంచే మన ఆంధ్రప్రదేశ్‌లో అన్ని హొటళ్ళ వాళ్ళు సమ్మె జేస్తున్నారు గనుక– అంటే మగాళ్ళకు ఇంట్లోనూ బయటా కూడా తిండి ఉండదు. దెబ్బకు మన డిమాండ్లకు అంగీకరించి తీరాలి..."

తప్పట్లు కేకలు, కోలాహలం–

మాతోపాటు శాయిరామ్ కూడా అక్కడే కూలబడిపోయాడు నీరసంగా.